# యేసు క్రీస్తు బాల్యజీవితం ఎక్కడ?

యేసు బాల్యంను గురించి కించపరిచేవిధంగా మాట్లాడే మూర్ఖులకు బైబిల్ సమాధానము.

**Subject-50**

by. **Rev.Dr.K.Noah. Director. WORD BIBLE COLLEGE, Hyderabad**

పాత నిబంధన గ్రంథములో ఆనాటి ప్రజల మధ్య దేవునికి విరోధమైన జ్ఞానాన్ని బోధించి దేవుని పోలిక చొప్పున సృష్టింపబడిన నరులను దేవునికి శత్రువులుగా మార్చి పరిశుద్ధులుగా బ్రతకవలసిన దేవుని జనాంగాన్ని వ్యభిచారులుగా మార్చి దేవునికోసం బ్రతకవలసిన ఆనాటి ప్రజలను లోకంకోసం బ్రతికేవిధంగా ప్రేరేపించి ప్రజల మధ్య కార్చిచ్చు రగిలించి కన్నతండ్రియైన దేవుడు తన చేతులతో, తన పిల్లలను తానే చంపుకొనే భయంకరమై యున్న దుస్థితిలోనికి దేవుని నడిపించి మానవాళిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తండ్రికి కడుపుకోతను మిగిల్చి ఈ లోకంలో వీరవిహారం చేస్తూ వున్న దెయ్యం యొక్క తంత్రం ఈనాటి క్రైస్తవులను ఎంత మాయ చేస్తున్నదో ఆలోచన చేస్తే ఆశ్చర్యం కలుగుతున్నది. భక్తుడి వేషం వేసుకొని మతం ముసుగులో మారణహోమాలు సృష్టిస్తువున్న పిశాచి వికృత స్వరూపం మానవాళికి కనబడకుండ వారి మనోనేత్రాలకు గ్రుడ్డితనం కలుగజేసి నీతిపరిచారకుడు వేషం ధరించుకొని, మానవకోటిని సమూలంగా నాశనం చేస్తున్న పైశాచిక, వికృత కరాళ నృత్యాలు దేవుని పిల్లలకు అర్థం కాకపోవటం చాలా విచిత్రంగా అనిపిస్తుంది.

సృష్టికర్తయైయున్న సర్వాధికారియైన దేవుడైయున్న యేసుక్రీస్తు దగ్గరకు వచ్చి (మత్తయి - 4వ అధ్యాయం) తనకు నమస్కారం చేయమంటున్న దెయ్యం యొక్క వికృతమైన ప్రకృతి విరుద్ధమైవున్న కోరికలను బట్టి దెయ్యం ఏమి కోరుకుంటుందో అర్థం చేసుకోవచ్చు, దీనిలో వున్న రహస్యం ఏమిటంటే దెయ్యం తన ఉనికిని, తన రూపాన్ని కనిపించనీయకుండా మర్మయుక్తముగా, ఏ బైబిలునైతే క్రైస్తవులు విశ్వసించారో ఆ బైబిలునే అర్థం కానీయకుండా చేసి యేసుక్రీస్తు బోధించిన రక్షణమార్గం అర్థం కానీయకుండా చేసి తన ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకోవటమే.

దేవుడు మాట్లాడని మాటలను, సిద్ధాంతాలుగా బోధిస్తూ ఒకే బైబిలును అనుసరిస్తూ వున్న క్రైస్తవులు ఒకటిగా ఉండకుండా చేయటం, దేవుని వాక్యం మీద సందేహం కల్పించటం, నామకార్థజీవితాన్ని జీవించటానికి క్రైస్తవులను పురికొల్పటం అపవాది యొక్క నిత్యకృత్యము. 2009 సం॥ల క్రితం పిశాచిక బంధహస్తాలలో నలిగిపోతూవున్న తన పిల్లలను విడిపించాలని తండ్రియైన దేవుడు భావించి లోకకళ్యాణం కోసం బహుమానంగా తానే ఈ భూమి మీద జన్మించాడు సృష్టికర్తయైన దేవుడు.చివరకు యేసు పుట్టుకను కూడా కల్మషం చేయాలని చూస్తున్న అపవాది తంత్రంను గురించి ఆలోచిస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. దొంగ బోధకులు, అబద్ద బోధకులు వస్తారని పౌలు క్రీ.శ 64 లో ఎలా వివరించాడో గమనించండి.

II **కొరింథి 11: 13-15. ఏలయనగా అట్టివారు క్రీస్తు యొక్క అపోస్తలుల వేషము ధరించుకొనువారైయుండి, దొంగ అపోస్తలులును మోసగాండ్రగు పనివారునైయున్నారు. ఇది ఆశ్చర్యము కాదు: సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు. గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతికాదు. వారి క్రియల చొప్పున వారికంతము కలుగును.**

I **తిమోతి 4:1, 2. అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు.**

**యాకోబు 3:15. ఈ జ్ఞానము పైనుండి దిగివచ్చినది కాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది.** ***I యోహాను 4:1. ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి***

దేవుడు సత్యవంతుడు. ఆయనలో ఏ అవినీతి లేదు. అయితే పరిశుద్ధుడయిన యేసుని పనికట్టుకొని కొంతమంది వివర్శించు విధముగా అపవాది ప్రేరేపిస్తున్నాడు. మొదటినుండి యేసు మీద బురద జల్లడం అపవాదికి అలవాటు. క్రీస్తు మరణించి నపుడు ఎటువంటి కుట్ర చేశాడో ఈ వాక్యం చూస్తే తెలుస్తుంది.

**మత్తయి. 28:12. కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచన చేసి ఆ సైనికులకు చాలా ద్రవ్యమిచ్చి మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తుకొని పోయిరని మీరు చెప్పుడి.**

పై వచనమును గమనించినట్లయితే క్రీస్తు త్యాగమును నిరర్థకం చేయు పునాది యేసుక్రీస్తు మరణించి సమాధిలో ఉన్నపుడే పడినదని గమనించాలి. ఆ నాటినుండి ఈనాటి వరకు అపవాది ఆరోపణ క్రీస్తు సిలువ మరణము పైనే ఉన్నదని గ్రహించాలి. కారణం ఏమిటంటే సిలువ మరణం అపవాదిని ఓడించినది, మరణపు ముల్లును విరిచినది, సిలువ మరణము పాపమునుండి సర్వ మానవులను రక్షిస్తున్నది. కాబట్టి ఏ సిలువ మరణం సర్వమానవులను నరకము నుండి రక్షిస్తున్నదో ఆ సిలువ మరణం పైన అనుమానం కలిగించుట ద్వారా ప్రజలను రక్షణ పొందకుండా చేయడం అపవాది యొక్క తంత్రం.ఇదే తంత్రమును ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రయోగిస్తూఉన్నాడు అపవాది.

యేసు క్రీస్తు సర్వాధికారమును భరించలేని అపవాది శాస్త్రులు, పరిసయ్యులతో ఆయన కార్యములను నిర్వీర్యం చేయునట్టు అపవాది వారిని ప్రేరేపించాడు. గమనించండి.

**మత్తయి. 12:24. పరిసయ్యులు ఆమాట విని ఈయన దయ్యములకు అధిపతి వలన బయల్జెబూలు వలననే దెయ్యములను వెళ్లగొట్టుచున్నాడు గానీ మరియొకని వలన కాదు అనిరి.**

ఆనాటి నుండి ఈ నాటి వరకు బైబిల్ మీద బురద జల్లేవారు, క్రీస్తుని నిందించేవారు వేల మంది వచ్చి ఎవరికిష్టం వచ్చినట్టు వారు స్టేట్ మెంట్లు ఇచ్చారు గానీ క్రైస్తవులలో విశ్వాసమును మార్చలేకపోయారు. ఎందుకంటే క్రైస్తవులు సర్వ సత్యముమ తెలుసుకున్నవారు, వెంబడిస్తున్నవారు.

ఇదే కోవలో అపవాది క్రీస్తు జీవితం మీద మచ్చ వేయాలని కొంత మందిని ఎన్నుకున్నాడు. వారు యేసుని గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు, వ్రాస్తున్నారు.

డా.వేదవ్యాస్ ఐ.ఎ.యస్ అనే వ్యక్తి ఒక పుస్తకం వ్రాశారు. ఆపుస్తకం పేరు 1999 కలియుగాంతం-కాలజ్ఞానం. ఈ పుస్తకంలో 191 వ పేజీలో క్రీస్తు 12 ఏండ్లవాడై యుండగా తన జన్మస్థానం వీడి ఎక్కడికో వెళ్లిపోయినట్టు, తిరిగి 30 సంవత్సరముల తర్వాత స్వస్థలములో అడుగు పెట్టినట్టు అప్పటికే ఆయన వద్ద యోగా శక్తులు ఉన్నట్టు బైబిల్ చూస్తే కనబడుతుంది అని వ్రాశారు. సత్యం తెలియని అమాయకులు దీనిని నమ్ముతున్నారు. డా.వేదవ్యాస్ వ్రాసిన ఈ అబద్దం దేనిని ఆధారం చేసుకొని వ్రాశారో ఆయనకే తెలియదు. ఆయన వ్రాసినది ఎంత అబద్ధమంటే ఆయన వ్రాసినట్టు 1999లో కలియుగాంతం కాలేదు. దీనిని బట్టి అతను ఎంత అజ్ఞానో అర్థం చేసుకోవచ్చు. తాను పరిశోధన చేయుట క్రైస్తవులకు అభ్యంతరం లేదు. కానీ ఆపేరుతో యేసు క్రీస్తుని కించపరిచే విధంగా కలం ఉన్నది కాదాని, పేజీలు ఉన్నాయి కదా అని బైబిల్ మీద పిచ్చిరాతలు వ్రాస్తే క్రైస్తవులు ఊరుకే ఉండరని, మత సాంప్రదాయాలను కాపాడడానికి భారత దేశ చట్టాలు ఉన్నాయని ఇలాంటి వారు గ్రహిస్తే మంచిది. ఇక అసలు విషయానికి వస్తే వేదవ్యాస్ లాంటి వారికి బుజ్జ బద్దలయ్యే నిజం బైబిల్ లో వ్రాయబడియున్నది. గమనించండి.

# యేసు బాల్యము ఎక్కడ?

**లూకా2:51. అంతట యేసు వారితో కూడా నజరేతుకు వచ్చి వారికి( తల్లిదండ్రులకు)లోబడి యుండెను.ఆయనతల్లి(మరియ) ఈ సంగతులన్నియు హృదయంలో భద్రము చేసుకొనెను.**

**లూకా2:52 యేసు జ్ఞానమందును, <u>వయస్సునందును</u>, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్థిల్లుచుండెను..**

యేసు జన్మించినపుడు హేరోదు యేసుని చంపించబోతున్నాడని దేవదూతలచేత హెచ్చరించబడి ఐగుప్తుకు తల్లిదండ్రులతో కొనిపోబడిన యేసు నజరేతునకు వెళ్లి తల్లిదండ్రులకు లోబడియున్నాడని, వయస్సునందు వర్ధిల్లుతున్నాడని అనగా వయసు నందు ఎదుగు తున్నాడని లేఖనాలలో ఇంత స్పష్టంగా వ్రాయబడియుంటే బైబిల్ మీద బురద జల్లాలనుకుంటున్న మూర్ఖులకు ఈ విషయం అర్థం కాదా???

యేసు క్రీస్తు నజరేతులో ఎదిగాడు. అంతేగాని డా. వేదవ్యాస్ లాంటి వారు కలియుగాంతం అనే పుస్తకంలో వ్రాసిన విధంగా ఇండియా రాలేదు. మంత్రాలు, తంత్రాలు నేర్చుకోవలసిన అవసరం సృష్టికర్తయైన యేసుకి లేదని వీరు అర్థం చేసుకోవాలి. యేసు తాను ఎదిగిన నజరేతునుండి వచ్చి యొర్దాను నదిలో బాప్తీస్మం తీసుకున్నాడని బైబిల్ లో రికార్డు చేయబడియున్నది. ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి..,గమనించండి.

**మార్కు. 1:9 ఆ దినములలో యేసు గలిలయలోని నజరేతు లోనుండి వచ్చి యోర్దానులో నుండి వచ్చి యోహాను చేత బాప్తీస్మము పొందెను**

ఇంత స్పష్టముగా యేసు క్రీస్తు నజరేతులో ఎదిగి తల్లిదండ్రులకు లోబడి ఎదిగి పెద్దవాడయి, నజరేతులోనుండి వచ్చి యోర్దాను నదిలో యోహాను ద్వారా నీతిని నెరవేర్చుటకు బాప్తీస్మం పొందెనని బైబిల్ బోదిస్తుంటే క్రీస్తు విరోధులయిన వారు ఈ విధంగా బైబిల్ మీద, యేసు మీద బురద జల్లడం ఎందుకో???